సాక్షి
యాదాద్రి భువనగిరి

మంగళవారం : 11 : జూన్ : 2024



వసతులు కరువు

ఉప్పలపహాడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. - 9లో



'రీజినల్'కు సహకరించాలి

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం రైతులు ప్రభుత్వానికి సహకరించాలని ఆర్డీఓ శేఖర్‌రెడ్డి కోరారు. - 10లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీనియార్టీ జాబితా వెల్లడి

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా అప్‌గ్రేడ్ చేయబడిన పండిట్లు, పీఈటీల సీనియార్టీ జాబితాను సోమవారం ప్రదర్శించారు. ఈ జాబితాలో ఉన్నవారు రెండు రోజుల్లో తమ అభ్యంతరాలు తెలియజేయవల్సి ఉంటుంది. అప్‌గ్రేడ్ పొందిన వారిలో తెలుగు 115, హిందీ 69, పీఈటీ 70, ఉర్దూలో నలుగురు ఉన్నారు. అదే విధంగా ఎస్‌జీటీల సీనియార్టీ జాబితాను సైతం విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. సీనియార్టీ ప్రకారం స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించనుంది. కాగా ఆర్‌జేడీ పరిధిలో జరిగే గెజిటెడ్ ప్రధానోపాయుల పదోన్నతికి సంబంధించిన సీనియార్టీ జాబితా ఇంకా ప్రకటించలేదు.

ఫంక్షన్ హాల్ నిర్మాణంపై విచారణ

గుండాల : మండలంలోని అనంతారంలో సర్వే నంబర్‌లో 19లో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ విషయంలో డీఎల్‌పీఓ శ్రీకాంత్ సోమవారం గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. గ్రామం మధ్య ఫంక్షన్ హాల్ నిర్మించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతారని, డీజే సౌండ్‌తో విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, నిర్మాణాన్ని నిలుపుదల చేయించాలని గ్రామస్తులు గత నెల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ తెలిపారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ధనుంజయ్, పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

భువనగిరి టౌన్ : ప్రజాపాలనలో గతంలో దరఖాస్తు చేసుకొని ఆన్‌లైన్‌లో తప్పిదాల వల్ల లబ్ధిపొందని వారి నుంచి మరోసారి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పలు రాజకీయ పార్టీల నాయకుల ఫిర్యాదు మేరకు సోమవారం భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ కానివారు ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తులు అందజేసి రశీదు పొందాలని మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి కోరారు.

శివుడికి విశేష పూజలు



స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి ప్రధానాలయానికి అనుబంధగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ముఖ మండపం, ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, శ్రీసుదర్శన హోమం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

మోత్కూరును రెవెన్యూ డివిజన్ చేయాలి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మోత్కూరు : మోత్కూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనువాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. మోత్కూరు జిల్లాలోనే వెనుకబడిన ప్రాంతం అని, రెవెన్యూ డివిజన్ చేస్తే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మోత్కూరు నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 42 కి.మీ, మారుమూల ప్రాంతాల నుంచి పోవాలంటే 70 కిలో మీటర్ల దూరం ఉంటుందన్నారు.రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూదగాని పాండు, పల్లెపాగ నర్సింహ, రమేష్, రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సోమవారం రాత్రి కురిసిన వర్షానికి భువనగిరిలోని ప్రధాన రోడ్డుపై వరద నీరు

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

సాక్షి,యాదాద్రి : వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ కోరారు. సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని, పిచ్చి మొక్కలు, నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ సునంద, మిషన్ భగీరథ ఎస్ఈ ఉన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి





ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అధికారులు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ

భువనగిరిటౌన్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజవాణి కార్యక్రమం పునఃప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై ప్రజలు వ్యయప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారని, జాప్యం చేయకుండా వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 40 ఫిర్యాదలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ 30, మున్సిపల్ 5, విద్యాశాఖ 3, పోలీసు, కార్మిక శాఖల నుంచి ఒక్కొక్కటి చొప్పున వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కృష్ణన్, జెడ్పీ సీఈఓ శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వినతులు ఇలా..

- బక్రీద్ పండుగకు ఈద్గాలు, మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ వక్ఫ్ బోర్డు కమిటీ మాజీ సభ్యుడు ఎండీ షరీఫ్ కలెక్టర్‌కు విన్నవించారు.
- పెద్ద కందుకూర్ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ మార్పు చేయాలని గ్రామస్తులు ప్రకాశ్, మహేందర్ కోరారు. సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఎస్సీకి రాకపోవడంతో తమ సామాజిక వర్గం ప్రజలు, నాయకులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కులగణణ చేసి రిజర్వేషన్ మార్చాలని విన్నవించారు.
- పట్టణ ఆవాస పాఠశాలను భువనగిరి నుంచి చందేపల్లి మార్చాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్‌కుమార్ కోరారు. చందేపల్లిఓ పాఠశాల ఏర్పాటు చేస్తే రవాణా పరంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.
- ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, ఇతర స్టేషనరీ, యూనిఫాం, బెల్టులు ,టైలు అమ్ముతున్నారని డీఈఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనుమతి లేకుండా వెలుస్తున్న పాఠశాలల విషయంలోనూ నోరు మెదపడం లేదని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, విద్యార్థి నాయకులు పవన్, భరత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలి



ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్ల వయస్సు దాటిన కార్మికులకు నెలకు రూ.5వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని, అర్హులకు ద్విచక్రవాహనాలు అందజేయాలని, గుర్తింపు కార్డులు రెన్యూవల్ చేయాలని కోరారు. కార్మికుడు బతికి ఉన్నంత వరకు వెల్ఫేర్ బోర్డులో సభ్యత్వం కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాసమల్ల కొమురయ్య, భీమారి నర్సింహ, మోర శ్రీనివాస్, నరాల శంకరయ్య, దాసరి యాదగిరి, రాజు, సిద్దులు, యాదగిరి, వెంకటేష శ్రీనివాస్, ఉప్పలయ్య, యాదగిరి, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

'గొంగిడి'కి పదవీ గండం!

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం

- డీసీఓకు అవిశ్వాసం నోటీసు అందజేసిన 14 మంది డైరెక్టర్లు
- ఈ నెల 28న అవిశ్వాస తీర్మాన సమావేశం
- 19 మంది డైరెక్టర్లలో 15 మంది కాంగ్రెస్ వైపే..
- అవిశ్వాసం నెగ్గే అవకాశం.. కుంభం శ్రీనివాస్‌రెడ్డికి చాన్స్!
- రాజీనామా యోచనలో మహేందర్‌రెడ్డి?



డీసీఓ కిరణ్‌కు అవిశ్వాసం నోటీసు అందజేసి మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డికి పదవీ గండం వచ్చి పడింది. ఆయనపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. బ్యాంకుకు చెందిన 14 మంది డైరెక్టర్లు సోమవారం ఆయనపై అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారి కిరణ్‌కు నోటీసు అందజేశారు. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఆయనతో సహా 14 మంది డైరెక్టర్లు కలెక్టరేట్‌కు ప్రత్యేక బస్సుల్లో వెళ్లి నోటీసు అందజేశారు. దీంతో మహేందర్‌రెడ్డిపై ఈనెల 28వ తేదీన అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు.

ప్రభుత్వం మారడంతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన వారికి ముఖ్య పదవులను కట్టబెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలు మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లలో అవిశ్వాసం ప్రవేశపెట్టి నెగ్గించుకుంది. తాజాగా నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) చైర్మన్ పదవిని తమ పార్టీకి చెందిన వారికి కట్టబెట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 14 మంది డైరెక్టర్లు సోమవారం అవిశ్వాసం నోటీసును అందజేశారు.

15కు చేరిన కాంగ్రెస్ బలం

డీసీసీబీలో 19 మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో 18 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కాగా, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్. ఇటీవల బ్యాంకు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనికి తోడు మరో ఏడుగురు బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్లు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ బలం కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలుపుకొని 9కి చేరింది. తాజాగా కాంగ్రెస్‌పార్టీ నేతృత్వంలోని డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీసుపై బీఆర్ఎస్‌కు చెందిన మరో ఆరుగురు డైరెక్టర్లు కూడా సంతకాలు చేశారు. బ్యాంకు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి విదేశాల్లో ఉండడంతో ఆయన నోటీసుపై సంతకం చేయలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ బలం 15కు చేరుకోగా.. బీఆర్ఎస్ బలం 4కు పడిపోయింది.

28వ తేదీన ప్రత్యేక సమావేశం

అవిశ్వాసం నోటీసు ఇచ్చిన సమయంలో జిల్లా సహకార అధికారి కిరణ్ డైరెక్టర్లతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ అవిశ్వాసానికి మద్దతుగా ఉన్నామని తెలియజేశారు. ఈ మేరకు 28వ తేదీన అవిశ్వాస తీర్మానానికి సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. డిపార్ట్‌మెంట్ తరఫున అందరికీ నోటీసులు పంపిస్తామని తెలియజేశారు. కోఆపరేటివ్ యాక్ట్ ప్రకారం నోటీసు ఇచ్చాక 15 రోజుల సమయం ఇచ్చి, 16వ రోజున అవిశ్వాసం తీర్మానం పెట్టనున్నారు.

2/3 మెజారిటీ అవసరం

అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే బ్యాంకు డైరెక్టర్లలో మూడింట రెండో వంతు (2/3) డైరెక్టర్ల ఆమోదం అవసరం. దాని ప్రకారం ప్రస్తుతం బ్యాంకులో ఉన్న 19 మంది డైరెక్టర్లలో అవిశ్వాసం నెగ్గేందుకు 14 మంది డైరెక్టర్ల మద్దతు అవసరం ఉంటుంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన డైరెక్టర్లు కలుపుకొని 9 మంది కాగా, సోమవారం నోటీసు ఇచ్చేందుకు 14 మంది సంతకాలు చేశారు. అంటే మరో ఆరుగురు బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్లు కాంగ్రెస్ వైపు వచ్చేశారు. మొత్తంగా కాంగ్రెస్ బలం 15కు చేరుకుంది. దీంతో అవిశ్వాసం నెగ్గే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

రాజీనామా యోచనలో ప్రస్తుత చైర్మన్?

డీసీసీబీ డైరెక్టర్లలో 15 మంది కాంగ్రెస్‌వైపే ఉండటంతో అవిశ్వాసం నెగ్గే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. దీంతో బ్యాంకు ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇటీవలే టిస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసానికి నోటీసులు ఇవ్వడంతో వారిద్దరూ ఆ పదవులకు రాజీనామా చేశారు. ప్రస్తుతం నల్లగొండ డీసీసీబీ చైర్మన్ పదవి విషయంలోనూ గొంగిడి మహేందర్‌రెడ్డి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

కుంభం శ్రీనివాస్‌రెడ్డికి అవకాశం!



డీసీసీబీ చైర్మన్ రేసులో కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడైన ఆయన ప్రస్తుతం డీసీసీబీ డైరెక్టర్‌గా ఉన్నారు. మొదటి నుంచి రాజగోపాల్‌రెడ్డికి వెన్నంటి ఉన్న ఆయనను డీసీసీబీ చైర్మన్ చేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు.



అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు ప్రత్యేక బస్సులో వచ్చిన డైరెక్టర్లు

పార్టీల వారీగా డైరెక్టర్ల ప్రస్తుత పరిస్థితి

గతంలో కాంగ్రెస్‌లో చేరిన వారు: తుంగతుర్తికి చెందిన గుడిపాటి సైదులు, భువనగిరికి చెందిన అందెల లింగం యాదవ్, నాగార్జునసాగర్‌కు చెందిన విరిగినేని అంజయ్య, మిర్యాలగూడకు చెందిన బంటు శ్రీనివాస్, కోదాడకు చెందిన డైరెక్టర్లు కె. వీరస్వామి, కొండా సైదయ్య, నల్లగొండకు చెందిన పాశం సంపత్‌రెడ్డి.

అవిశ్వాసం నోటీసుపై తాజాగా సంతకాలు చేసిన వారు : ధనావత్ జయరాం, ఎస్.అనురాధ, కోడి సుష్మ, జూలూరి శ్రీనివాస్, కొమ్ము కరుణ, ఎం. రామచంద్రయ్య

బీఆర్ఎస్‌లో మిగిలిన వారు : ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, రంగాచారి, నేరెడుగొమ్ముకు చెందిన ప్రవీణ్‌రెడ్డి, నేరెడుచర్లకు చెందిన అప్పిరెడ్డి.

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు

బొమ్మలరామారం(తుర్కపల్లి) : నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఇంటర్నల్ స్క్వాడ్ టీం సభ్యులు హెచ్చరించారు. తుర్కపల్లి, ఇబ్రహీంపూర్, దత్తాయిపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలన సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిర్దేశిత ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ దేవ్‌సింగ్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, తుర్కపల్లి ఏఓలు ఏకే ఖాన్, అంజని, దుర్గేశ్వరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్ : రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 15, 16 తేదీల్లో జరగనున్న న్యాయవాదుల శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఐలూ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శిక్షణ తరగతుల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో తడక మోహన్, తాడూరి పరమేష్, జెల్ల రమేష్, మహిపాల్‌రెడ్డి, స్వాతి,జక్కర్తి శేఖర్, బాల్యం వెంకటాచలపతి, బడుగు శ్రీకాంత్, జంగయ్య, శ్రీశైలం, ఎండీ ఖయ్యూం, సత్యనారాయణ పాల్గొన్నారు.

లూజ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దు

- రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకొని భద్రపరుచుకోవాలి
- అవసరం ఉన్నవారికే భూసార పరీక్షలు చేయిస్తున్నాం

'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ

సాక్షి, యాదాద్రి : 'రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో లూజ్ విత్తనాలు కొనవద్దు. కొనుగోలు చేసిన వెంటనే తప్పనిసరిగా రశీదు తీసుకొని పంటకాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలి. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి' అని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. పంటల సాగులో మెళకువలు, విత్తన ఎంపిక తదితర అంశాలపై సోమవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ ప్రోగాం ద్వారా రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

ప్రశ్న : ఎరువులు, విత్తనాలు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

-వెంకటేష్, లక్ష్మాపురం, లింగస్వామి, భూదాన్‌పోచంపల్లి

డీఏఓ : అధిక ధరలకు విక్రయించినా, బిల్లు ఇవ్వకపోయినా చట్టరీత్యా నేరం. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయగానే రైతులు వెంటనే ప్రింటెడ్ బిల్లు తీసుకోవాలి. పేపర్ మీద రాసిస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : నకిలీ విత్తనాలు ఎలా గుర్తించాలి?

-శ్రీనివాస్ యాదవ్ , లింగోజిగూడెం, చౌటుప్పల్

డీఏఓ : లేబుల్ ఉన్న ప్యాకెట్ విత్తనాలనే కొనుగోలు చేయాలి. లూజ్ విత్తనాలను కొనుగోలు చేయవద్దు. ప్రభుత్వం యంత్రాలకు సబ్సిడీ ఇవ్వడం లేదు. ఒక వేళ ఇస్తే మీకు తెలియజేస్తాం.

ప్రశ్న : కోతులు, అడవిపందుల బెడద ఉంది.

-శంకర్, రాజాపేట, మల్లారెడ్డి, సిరిపురం

డీఏఓ కోతులు, అడవిపందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలంటూ ఏమీ లేవు. కాకపోతే పంట చుట్టూ కుసుమ పంట వేయాలి. కుసుమ మొక్కలకు ముళ్లు ఉండడంతో వాటిని దాటుకొని పొలాల్లోకి రాకుండా అడ్డుకోవచ్చు.

ప్రశ్న : చౌడు భూముల్లో ఏ రకమైన పంటలు సాగు చేయాలి?

-రామిడి బాల్‌రెడ్డి, నాగినేనిపల్లి, దాసరి జంగారెడ్డి, హాజీపూర్

డీఏఓ : పచ్చిరొట్ట ఎరువులు, కె.ఎన్ఎం118 రకం వరి విత్తనాలకు చౌడు భూములు అనువైనవి.

ప్రశ్న: వరి విత్తనాలు ఎప్పటి వరకు వేయొచ్చు?

-వేముల సైదులు, కక్కిరేణి



ఫోన్ ఇన్ కార్యక్రమంలో రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

డీఏఓ ఈ నెలాఖరు వరకు నారు పోసుకుని, జూలై నెల చివరి వరకు నాట్లు వేయాలి. కందులు వేయడానికి ప్రస్తుతం అనువైన సమయం.

ప్రశ్న : ధనియాలు మొలకెత్తడం లేదు.

- సుదర్శన్, బొమ్మలరామారం

డీఏఓ : భూసార పరీక్షలు చేయాలి. నకిలీ విత్తనాలు ఎట్టి పరిస్థితిలో వాడవద్దు. లేబుల్ ఉన్న విత్తన ప్యాకెట్లనే కొనుగోలు చేయాలి.

ప్రశ్న :పండ్ల తోటలు, పామాయిల్ వేయొచ్చా?

-షేక్ చాంద్, రామన్నపేట

డీఏఓ : మార్కెట్‌లో పండ్లకు మంచి డిమాండ్ ఉంది కాబట్టి పండ్ల తోటలు సాగు చేయడం ద్వారా లాభాలు గడించవచ్చు. నీటి వసతి ఉంటే పామాయిల్ కూడా సాగు చేయవచ్చు.

ప్రశ్న : వరిలో కొత్త వంగడాలు వచ్చాయా?

-అంజిరెడ్డి, నర్సాపూర్

డీఏఓ : తెలంగాణ సోనా రకం వంగడం వచ్చింది. దొడ్డు రకం జేజీఎల్ 24423, డబ్ల్యూజీఎల్ 44,2143 విత్తనాలు వేసుకోవాలి. బీపీటీ విత్తనాలు వేయొద్దు. తేనేటీగల పెంపకం కూడా లాభసాటిగా ఉంటుంది.

ప్రశ్న : ఎర్రరకం భూములు ఏ పంటలకు అనుకూలం?

-యాదగిరి, భూదాన్‌పోచంపల్లి, వెంకటేశ్, ఎర్రంబెల్లి

డీఏఓ : సన్నరకం కేఎస్ఆర్ 15048, తెలంగాణ సోనా, దొడ్డు రకం ఐఆర్ 64, ఎంటీయూ1010, కేఎన్ఎం118 రకాలు సాగు చేయవచ్చు.

ప్రశ్న: అంతర పంటగా కంది సాగు చేయొచ్చా?

-నాగరాజు, అడ్డగూడూరు

డీఏఓ పత్తిలో అంతర పంటగా కందులు వేసుకోవచ్చు. ప్రస్తుతం కంది సాగుకు అనుకూలం. ప్రత్యేకంగా కూడా కందులు వేసుకోవచ్చు. కందులు అసరమైన వారికి వరంగల్ రీసెర్చ్ సెంటర్ నుంచి తెప్పించి ఇస్తాం.

ప్రశ్న : యూరియా బ్లాక్‌లో అమ్ముతున్నారు.

-దాచేపల్లి రాజు, శేఖర్‌రెడ్డి, మోటకొండూరు

డీఏఓ : సాగు అంచనాల మేరకు ఎరువులను అందుబాటులో ఉంచాం. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి వద్ద రాక్‌పాయింట్ మంజూరైంది. ఆలస్యం జరగకుండా వెంట వెంటనే ఎరువులు వస్తాయి. మోటకొండూరు మన గ్రోమోర్ కేంద్రంపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిస్తాం. నివేదిక వచ్చే వరకు అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశిస్తాం.

ప్రశ్న : జీలుగ విత్తనాలు దొరకడం లేదు.

-శ్రీనివాస్ చౌటుప్పల్, దాచేపల్లి రాజు,రాజాపేట

డీఏఓ : భూదాన్‌పోచంపల్లిలో అందుబాటులో ఉన్నాయి. ఎవరికైనా కావాలంటే వెళ్లి తీసుకోవచ్చు. ఏఓకు చెబుతాను.

ప్రశ్న : భూసార పరీక్షలు ఎప్పుడు చేస్తారు?

-నివాస్‌రెడ్డి, ఛట్టుగూడెం

డీఏఓ : ఏప్రిల్, మే మాసాల్లో భూసార పరీక్షలు చేయాలి. కానీ, నాలుగేళ్లగా నిర్వహించడం లేదు. అవసరమైన వారికి మాత్రమే భూసార పరీక్షలు చేయిస్తున్నాం.

క్లుప్తంగా

పశువుల పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని సోమవారం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్ నుంచి 72 పశువులు(ఆవులు, ఎద్దులు, కోడెలు)ను ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం సునావత్‌తండాకు చెందిన సునావత్ కృష్ణని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని పశువులను హైదరాబాద్‌లోని జియాగూడలో గల గోశాలకు తరలించారు. ఈ మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పూరిల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద బాధితురాలు

మోతె: మండల పరిధిలోని అన్నారిగూడెంలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారిగూడెం గ్రామానికి చెందిన పడిశాల సువార్తకు పూరింట్లో నివాసముంటోంది. సోమవారం ఆమె ఇంట్లో లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా దట్టమైన పొగతో మంటలు లేచి పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పేశారు. ఇంట్లో ఉన్న వస్తువులు, బియ్యం, దుస్తులు కాలిబూడిదయ్యాయి. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.

కౌలు రైతులను ఆదుకోవాలి

కోదాడ రూరల్: వానాకాలం వ్యవసాయ సీజన్ నుంచే కౌలు రైతులకు కూడా ప్రభుత్వ పథకాలను వర్తింపజేసి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ మండలం తమ్మరలో నిర్వహించిన రైతులు, కౌలు రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా, బీమా, బోనస్, పంటబీమా, షరతులు లేకుండా బ్యాంకు రుణాల వంటి పథకాలు అందిచేందుకు విధివిధానాలను రూపొందించాలని కోరారు. గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారికి 2011 చట్టం ప్రకారం గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, సామినేని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా

- తమ కుమార్తె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు, బంధువుల ఆరోపణ



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న హరిస్మిత కుటుంబ సభ్యులు

సూర్యాపేట: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతిచెందిందని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు సోమవార సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. వివరాలు.. చివ్వెంల మండలం గుర్రంతండాకు చెందిన రత్నావత్ సైదులు, రమ్య దంపతుల కుమార్తె హరిస్మిత(17) ట్రానిల్స్‌తో బాధపడుతూ సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి మే 20వ తేదీన వెళ్లింది. అక్కడి వైద్యులు ఆమెను పరిశీలించి ఆపరేషన్ అవసరమని గుర్తించి పలు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మే 31వ తేదీన ఉదయం ఆపరేషన్ చేసేందుకు గాను వైద్యులు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. అయితే మధ్యాహ్నం అవుతున్నా తమ కుమార్తెను ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు తీసుకురాకపోవడంతో తల్లిదండ్రులు ఆస్పత్రి హెచ్‌ఓడీని కలిశారు. అనస్తీషియా వేయడంతో యువతి అపస్మారకస్థితిలోకి వెళ్లిందని హెచ్‌ఓడీ వారికి తెలిపింది. ఏమీ కాదని చికిత్సకు కావాల్సిన వైద్య సదుపాయాలు ఇక్కడ లేవని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచిస్తూ అంబులెన్స్‌ను మాట్లాడి పంపించింది. అక్కడ రెండు రోజులు వైద్యం అందించినప్పటికీ హరిస్మిత ఈ నెల 4న మృతి చెందింది. మోతాదుకు మించి మత్తు మందు ఇవ్వడం వల్లే తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపిస్తూ మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు సోమవారం సూర్యాపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. వారికి సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మద్దతు తెలిపారు. పోలీసులు అక్కడకు వచ్చి ఆందోళన విరమించాలని, ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుకోవాల్సిందిగా సూచించారు. దీంతో వారు సూపరింటెండెంట్‌ను కలిసి మాట్లాడగా.. ఈ ఘటనపై విచారణ కమిటీ వేసి వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ వారు ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బావిలో పడిన వృద్ధురాలిని కాపాడిన పోలీసులు



వృద్ధురాలిని బయటకు తీసిన అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది

హుజూర్‌నగర్: ప్రమాదవశాత్తు బావిలో పడిన వృద్ధురాలిని అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది కాపాడారు. ఈ ఘటన ఆదివారం రాత్రి హుజూర్‌నగర్‌లో జరిగింది. వివరాలు.. హుజూర్‌నగర్ పట్టణంలోని గాంధీపార్కు సమీపంలో నివాసముంటున్న వృద్ధురాలు కనకదుర్గ కళ్లు కనబడక వాళ్ల ఇంటి ఆవరణలో నీళ్లులేని 40 అడుగుల లోతు ఉన్న బావిలో పడిపోయింది. ఆమె కేకలు వేయడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్‌ఐ ముత్తయ్య అగ్నిమాపక సిబ్బందికి విషయం తెలియజేశారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వృద్ధురాలిని బావిలో నుంచి క్షేమంగా బయటకు తీశారు. స్వల్ప గాయాలైన ఆమెను 108 వాహనంలో ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, ఫైర్ కానిస్టేబుళ్లు సురేందర్‌రెడ్డి, శ్రీను, సైదులు, నాగరాజు, పోలీస్ సిబ్బంది రాము, వెంకటేశ్వర్లు, గబ్రూనాయక్, స్థానికులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాడుగులపల్లి: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మాడుగులపల్లి మండల కేంద్రంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండల కేంద్రానికి చెందిన ఆరూరి నరేష్ ఈ నెల 8వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరిచి లోపల వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రూ.90 వేలు కనిపించలేదు. దీంతో అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు ఇంటి పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

భారీ వర్షం.. జలమయమైన రోడ్లు



పోచంపల్లిలో..



భువనగిరి పట్టణంలోని జంఖానగూడెం చౌరస్తా వద్ద భారీగా ప్రవహిస్తున్న వరద నీరు



భువనగిరిలో కురుస్తున్న వర్షం

భువనగిరి: పట్టణంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ప్రధాన నాలాలతో పాటు ప్రధాన రహదారిపై వరద నీరు నదీ ప్రవాహాన్ని తలపించాయి. జిల్లా కోర్టు ఆవరణ, ఆర్టీసీ బస్టాండ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణ వరద నీటితో నిండిపోయింది. పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి రైతు బజార్ వరకు ప్రధాన రహదారిపై భారీ వరద వల్ల వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. నల్లగొండ చౌరస్తా సమీపంలోని రాంనగర్ వద్ద నల్లగొండ మార్గంలో రోడ్డు మీదగా పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించింది. జంఖానాగూడెం చౌరస్తా వరద నీటితో రాకపోకలు నిలిచిపోయాయి. కుమ్మరివాడ, హౌజింగ్‌బోర్డు కాలనీ, వసుంధర థియేటర్ ఎదురుగా ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. వరద ప్రవాహంతో వచ్చిన బురదతో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద వరద నీటితో వచ్చిన మట్టితో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రైతు బజార్‌లో చేరిన వర్షపు నీటితో వినియోగదారులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పలేదు.

భువనగిరిలో 57మి.మీ. వర్షపాతం..

భువనగిరిలో 57 మి.మీ. వర్షం కురువగా.. రాజాపేట మండలంలో 53.3 మి.మీ. బీబీనగర్ మండలం వెంకిర్యాలలో 35.3 మి.మీ. నారాయణపురం మండలం జనగాంలో 28.8 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది.

రాజాపేటలో

రాజాపేట: మండలంలోని పాముకుంట, రేణికుంట, బేగంపేట, రాజాపేట, పారుపల్లి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై వర్షం నీరు నిలిచింది.

పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి : మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. రాత్రి 7గంటలకు ప్రారంభమైన వర్షం గంటపాటు ఎడతెరపి లేకుండా కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

మోతె: కాలు జారి వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మోతె మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలు.. సిరికొండ గ్రామానికి చెందిన కట్టబోయిన లింగయ్య(32) సోమవారం గ్రామ శివారులో గొర్రెలు మేపుతూ మధ్యాహ్నం సమయంలో నీళ్లు తాగడానికి వ్యవసాయ బావిలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయాడు. అతడికి ఈత రాకపోవడంతో బావిలో మునిగి మృతిచెందాడు. సాయంత్రం లింగయ్య గొర్రెలు తోలుకొని ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలాలు, బావుల వద్దకు వెళ్లి వెతకగా బావి వద్ద అతడి చెప్పులు గమనించి బావిలోకి దిగి వెతకగా.. అప్పటికే అతడు మృతిచెందాడు. లింగయ్య మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



మృతిచెందిన ఆవు

రాజాపేట: పిడుగుపాటుకు గురై పాడి ఆవు మృతిచెందింది. వివరాలు.. రాజాపేట మండలం బేగంపేట గ్రామంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో గ్రామానికి చెందిన మూల సాయిలు మేత కోసం పొలాల్లోకి వదిలిన తన ఆవులను పశువుల పాకలోకి తోలుకొస్తుండగా.. ఒక్కసారిగా పిడుగు పడడంతో ఒక పాడి ఆవు మృతిచెందింది. మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): మంత్రాల నెపంతో వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా కోర్టు జడ్జి ఎస్. రోజారమణి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ మండలం నర్సింగ్‌భట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కూతురుగూడెం గ్రామానికి చెందిన పెద్దబోయిన శ్రీను వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. అదే గ్రామానికి చెందిన కానుగు వెంకయ్య ఊళ్లోని గుడిలో పనిచేస్తూ పాము, తేలుకాటుకు వైద్యం చేసేవాడు. 2013 సంవత్సరం ప్రారంభంలో శ్రీను అనారోగ్యానికి గురయ్యాడు. వెంకయ్య మంత్రాలు చేయడం వలనే తాను అనారోగ్యానికి గురయ్యాయని వెంకయ్యపై శ్రీను కక్ష పెంచుకున్నాడు. 2013 ఫిబ్రవరి 18వ తేదీన సాయంత్రం వెంకయ్య గుడి ముందు శుభ్రం చేస్తుండగా.. శ్రీను విచక్షణారహితంగా గొడ్డలితో వెంకయ్యపై దాడి చేశాడు. వెంకయ్య కేకలు వేయడంతో గుడి సమీపంలోనే వెంకయ్య ఇల్లు ఉండడంతో అతడి కుమారుడు సత్యనారాయణ విని గుడి వద్దకు చేరుకున్నాడు. శ్రీను గొడ్డలితో సత్యనారాయణను బెదిరించి అక్కడ నుంచి పరారయ్యాడు. తన తండ్రిని హత్య చేసిన పెద్దబోయిన శ్రీనుపై చర్యలు తీసుకోవాలని నలగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అప్పటి సీఐ టి. మనోహర్‌రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచాడు. ఈ కేసు తుది విచారణలో భాగంగా సోమవారం ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జిల్లా కోర్టు జడ్జి రోజారమణి నిందితుడు పెద్దబోయిన శ్రీనుకు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

అత్యాచార కేసులో నిందితుడికి జైలుశిక్ష

చివ్వెంల(సూర్యాపేట): కన్న కూతురిపై అత్యాచారం చేసిన తండ్రికి 25 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు స్పెషల్ సెషన్స్ మహిళా జడ్జి శ్యామ్‌శ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన మర్రి సంపత్‌కుమార్ అలియాస్ మండల సంపత్‌కు, మడత మహేశ్వరికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరు సూర్యాపేటలోని అన్నాదురై నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. సంపత్‌కుమార్ చికెన్ షాపులో పనిచేస్తుండగా, మహేశ్వరి బట్టల దుకాణంలో పనిచేస్తోంది. తొమ్మిదేళ్ల వయస్సున్న పెద్ద కుమార్తె స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో 4 వతరగతి చదువుతుండగా, ఐదేళ్ల వయస్సున్న చిన్న కుమార్తె ఇంటి వద్దే ఉంటుంది. గతేడాది ఫిబ్రవరి 23వ తేదీ రాత్రి భోజనం చేసిన తర్వాత కుటుంబ సభ్యులందరూ నిద్రిస్తున్న సమయంలో సంపత్‌కుమార్ తన పెద్ద కుమార్తెపై అత్యాచారానికి పాల్పడుతుండగా అతడి భార్య చూసింది. దీంతో వెంటనే సంపత్‌కుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. మరుసటి రోజు మహేశ్వరి తన సోదరుడికి జరిగిన విషయం చెప్పి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించిన సూర్యాపేట జిల్లా కోర్టు స్పెషల్ సెషన్స్ మహిళా జడ్జి శ్యామ్‌శ్రీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ పోక్సో చట్టం, అత్యాచారం చట్టం కింద నిందితుడికి 25 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల జైలుశిక్ష పొడిగించాలని సూచించారు. ఈ కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ లెనిన్ సహకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగార్జునసాగర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జునసాగర్‌లోని పైలాన్‌కాలనీకి చెందిన దుర్గాప్రసాద్, ఊర గణేష్, నంద్యాల పవన్‌కుమార్ ఈ నెల 2వ తేదీన బైక్‌పై హిల్‌కాలనీ వైపు వెళ్తూ పైలాన్‌కాలనీకి చెందిన కుంటిగొర్ల దుర్గయ్య(65)ను ఢీకొట్టారు. తీవ్రగాయాల పాలైన దుర్గయ్యను నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి.. మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న దుర్గాప్రసాద్‌కు కూడా గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన..

దుర్గయ్య మృతదేహాన్ని ఆయన బంధువులు సోమవారం రాత్రి అంబులెన్స్‌లో తీసుకొచ్చి నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉంచి తమకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. యువకులు మద్యం సేవించి బైక్ నడపడం వల్లే నిండు ప్రాణం పోయిందని ఆరోపించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వారికి సర్దిచెప్పారు. ప్రమాదానికి కారణమైన దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మహత్యకు కారకులైన నలుగురి రిమాండ్

హుజూర్‌నగర్ : వ్యక్తి ఆత్మహత్యకు కారకులైన నలుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చరమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ చిట్టిప్రోలు రంజిత్‌కుమార్, స్వప్న భార్యభర్తలు. ఆరునెలల క్రితం స్వప్నకు మిట్టకోలు దుర్గాప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో రంజిత్‌కుమార్, స్వప్న మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం రంజిత్‌కుమార్‌ను అతడి భార్య స్వప్న, అత్త రాచకొండ నాగమణి, బావమరిది చంద్రశేఖర్, ప్రియుడు దుర్గాప్రసాద్ కొట్టారు. దీంతో అతను ఏడుస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన రంజిత్‌కుమార్ రెండు రోజుల క్రితం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి చిట్టిప్రోలు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్వప్న, నాగమణి, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటామని, ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ పరిధిలోని ప్రతి ఫిర్యాదునూ వేగంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బాధితులకు కచ్చితంగా న్యాయం జరుగుతుందనే భరోసాను పోలీసులే కల్పించాలన్నారు. మీకు ఆన్‌లైన్‌లో బహుమతులు వచ్చాయని, ఫోన్ కాల్ ద్వారా అపరిచితులు వ్యక్తిగత, బ్యాంక్, ఏటీఎం పిన్, ఓటీపీ వివరాలు అడుగుతారని, ఇలాంటి వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. అపరిచితులు వ్యక్తిగత వివరాలు తెలపవద్దని విజ్ఞప్తి చేశారు.

– నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

నూతన చట్టాలు అమలు చేయడానికి ప్రతి అంశంపై సిబ్బందికి అవగాహన ఉండాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి శిక్షణ తరగతులు ప్రారంభించి మాట్లాడారు. పోలీస్ సిబ్బంది, అధికారులు ప్రతిఒక్కరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది అందరూ శిక్షణకు షెడ్యూల్ ప్రకారం హాజరు కావాలన్నారు. ఈ తరగతులు సీనియర్ హైకోర్టు అడ్వకేట్, సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, తెలంగాణ పోలీస్ అకాడమీ అధ్యాపకులు డాక్టర్ సాంబమూర్తి హాజరై శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కీం' లక్కీ డ్రా వేదిక మార్పు

భానుపురి (సూర్యాపేట): 2024–25 సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి, 5వ తరగతుల్లో ప్రవేశానికి చేసుకున్న దరఖాస్తుల లక్కీ డ్రా వేదికను సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ నుంచి సూర్యాపేట ఫంక్షన్ హాల్‌కు మార్చినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.లత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటలకు విద్యార్థుల తల్లిదండ్రులు రావాల్సిందిగా కోరారు.

సమీకృత పద్ధతిలో సేంద్రియ వ్యవసాయం

- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతు శేషుకుమార్

పాడి పంట



ఇజ్రాయిల్ టెక్నాలజీలో సాగులో ఉన్న మామిడి



మామిడిలో అంతర పంటగా సాగు చేసిన పెసర

నడిగూడెం: మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన వాసికర్ల శేషుకుమార్ గత నాలుగు సంవత్సరాలుగా సమీకృత పద్ధతిలో సేంద్రియ వ్యవసాయం చేస్తూ అనేక మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయనకున్న 12 ఎకరాల్లో 1.50 ఎకరాల విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడితో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా అనేక పంటలు సాగు చేస్తూ నిత్య ఆదాయం పొందుతున్నాడు. అంతేకాకుండా ప్రత్యేకంగా షెడ్‌లు నిర్మించి గొర్రెలు, నాటు కోళ్లు పెంచుతున్నాడు. ప్రత్యేకంగా కుంటను ఏర్పాటు చేసి చేపల పెంపకం కూడా చేపట్టాడు. మరోవైపు పశుగ్రాసం కోసం గడ్డి కూడా పెంచుతున్నాడు. మిగతా విస్తీర్ణంలో సీజనల్‌గా బంతి పూలు, టమాట, వంగ, బెండ, గోకర, బీర, కాకర, బొంతుకాకర, చిక్కుడు, క్యారెట్, మునగ, సొర, దోస, మిరప, పాలకూర, బచ్చలికూర, మెంతికూర, కరివేపాకు, మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, అరటి, రేగు, బొప్పడి, డ్రాగన్‌ఫ్రూట్, చింత, అల్లం, పెసర, మినుము, బొబ్బెర, కంది సాగు చేస్తున్నాడు.

ఇజ్రాయిల్ టెక్నాలజీలో మామిడి సాగు

సాగులో ప్రయోగాలు చేయడంలో శేషుకుమార్ ముందంజలో ఉంటారు. నిత్యం ఒకే పంట పండించకుండా ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేస్తూ ఉన్నాడు. ఈ ఏడాది 40 సెంట్ల విస్తీర్ణంలో ఇజ్రాయిల్ టెక్నాలజీ విధానం(అధిక సాంద్రత పద్ధతి)లో మామిడి తోట వేశాడు. సాధారణంగా మామిడి తోటలో ఎకరానికి 40 మొక్కలను నాటుతారు. కానీ అందుకు భిన్నంగా కేవలం 40 సెంట్ల విస్తీర్ణంలోనే 170 మొక్కలను నాటాడు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కేసరి, హిమాయత్, దోశేరి, బంగినపల్లి, చెరుకు రసాలు, తెల్లగులాబీ, ఇంకా ఇతర రాష్ట్రాలకు చెందిన దాదాపు 50 రకాలు సాగు చేస్తున్నాడు.

రసాయన ఎరువులు లేకుండానే..

పంటల సాగులో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పెంట, వానపాముల ఎరువు, జీవామృతం, నీమాస్త్రం, వేప నూనె, అగ్నిహాస్త్రం తదితర ద్రావణాలను ఉపయోగిస్తున్నాడు. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు నేరుగా శేషుకుమార్ వ్యవసాయ క్షేత్రానికి వచ్చే కొనుగోలు చేస్తున్నారు.

నిత్యం ఆదాయం వస్తోంది



నాకు 12 ఎకరాలకు గాను గత మూడేళ్లుగా 1.50 ఎకరాల్లో సమీకృత వ్యవసాయం చేపట్టాను. తక్కువ స్థలంలో షెడ్ ఏర్పాటు చేసి గొర్రెలు, మేకలు, నాటుకోళ్లను పెంచడంతో పాటు ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా అన్నిరకాల కూరగాయలు, పండ్ల మొక్కలు, పూల తోటలు, పశుగ్రాసాలు సాగు చేస్తున్నాను. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడికే వచ్చి కూరగాయలు, పండ్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నిత్యం ఆదాయం వస్తుంది. రైతులు వరికి బదులుగా పంట మార్పిడి పాటిస్తూ సమీకృత వ్యవసాయం సాగు చేస్తే బాగుంటుంది.

– వాసికర్ల శేషుకుమార్, ఆదర్శ రైతు, సిరిపురం